క్లుప్తంగా

ప్రత్యామ్నాయ పంటల సాగుతో బహుళ ప్రయోజనాలు

దేవరుప్పుల: ప్రత్యామ్నాయ పంటల సాగుతో రైతులు బహుళ ప్రయోజనాలు పొందుతారని వ్యవసాయ శాఖ పాలకుర్తి ఏడీఏ పరశురామ్ సూచించారు. మంగళవారం మండల కేంద్రం లోని రైతు వేదికలో ఆయిల్ పామ్ సాగుపై తలపెట్టిన అవగాహన సదస్సులో ఆయన పాల్గొన్నారు. ప్రభుత్వం ప్రత్యామ్నాయ పంటల సాగు కోసం విరివిగా రాయితీలు ఇస్తున్న తరుణంలో అత్యంత తక్కువ ఖర్చులో అధిక లాభాలు గడించే ఆయిల్‌పామ్ సాగుపై రైతులు దృష్టి సారించాలన్నారు. మండల వ్యవసాయాధికారి దివ్య, ఏఈఓ సాగర్ పాల్గొన్నారు.

సన్మానం



చిల్పూరు: మల్కాపూర్ గ్రామానికి చెందిన 'నా ఆలోచన.. రైతు నేస్తం' కేశిరెడ్డి రాజేశ్వర్‌రెడ్డిని మంగళవారం హైదరాబాద్ రవీంద్రభారతిలో రెడ్డి జాగృతి ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. మేలైన వ్యవసాయం పై రైతులకు సూచనలు చేస్తున్న ఆయనను జాగృతి నిర్వాహకులు బట్టంగూడి మాధవ రెడ్డి, అధ్యక్షురాలు కవితారెడ్డిలు ఉత్తమ ప్రతిభా అవార్డుతో సత్కరించారు. ఈ సందర్భంగా రాజేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ ప్రతీ రైతు మేలైన వ్యవసాయం చేయాలన్నదే తన తపన అన్నారు.

ఇంకుడు గుంత నిర్మాణం



జనగామ: జిల్లా కేంద్రం రెవెన్యూ డివిజనల్ కార్యాలయంలో ఇంకుడు గుంత నిర్మాణ పనులను ఆర్డీఓ గోపీరామ్ ప్రారంభించారు. కలెక్టర్ రిజ్వాన్ బాషా ఆదేశాల మేరకు చేపట్టిన ఇంకుడు గుంత పనులను ఆర్డీఓ ప్రాంభించారు. డివిజనల్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ శ్రీనివాస్, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

చేయూత



జఫర్‌గఢ్: వడ్డెగూడెం, ఓబులాపూర్ గ్రామాలకు చెందిన పూర్వ విద్యార్థులు తాటికాయల భాస్కర్, గబ్బెట కుమారస్వామికి 2004–2005 పదోతరగతి బ్యాచ్ మిత్రులు మంగళవారం ఆర్థికసాయం అందజేశారు. ఇటీవల విద్యుత్ షాక్‌తో తీవ్రంగా గాయపడి మంచానికే పరిమితమైన భాస్కర్‌కు రూ.30 వేలు, రోడ్డు ప్రమాదంలో గాయపడిన గబ్బెట కుమారస్వామికి రూ.10 వేలు అందించారు.

'కలిసికట్టుగా కాంగ్రెస్‌ను ఓడించాలి'

చిల్పూరు: బీఆర్‌ఎస్ నాయకులు కలిసి కట్టుగా ఉంటూ స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను ఓడించాలని పార్టీ మాజీ ఎమ్మెల్యే డాక్టర్ రాజయ్య పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో మంగళవారం పార్టీ మండల ముఖ్య నాయకుల సమావేశం మండల ఇన్‌చార్జి మాలోత్ రమేష్ నాయక్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా రాజయ్య మాట్లాడారు. ఎడవెల్లి కృష్ణారెడ్డి, కేశిరెడ్డి రాకేష్‌రెడ్డి, జనగాం యాదగిరి, కేశిరెడ్డి మనోజ్‌రెడ్డి, ఉడుత వెంకన్న, నారగోని రాజు, రంగు హరీష్, రాజ్‌కుమార్, కంకటి రవి ఉన్నారు.

'బీఆర్‌ఎస్ గెలుపునకు కృషి చేయాలి'

పాలకుర్తి టౌన్: స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థుల గెలుపునకు కార్యకర్తలు కలిసి కట్టు కృషి చేయాలని బీఆర్‌ఎస్ పార్టీ జిల్లా నాయకుడు, పాలకుర్తి మండల ఎంపీటీసీ ఎన్నికల ఇన్‌చార్జ్ పళ్ల సుందర్‌రామిరెడ్డి అన్నారు. ముత్తారం గ్రామంలో స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణ సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. నవీన్‌కుమార్, ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

నీటి సమస్యకు పరిష్కారం



రఘునాథపల్లి: ఎమ్మెల్యే కడియం శ్రీహరి జన్మదినాన్ని పురస్కరించుకుని యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు బొనాసి క్రాంతికుమార్ పాఠశాలలో దీర్ఘకాలికంగా నెలకొన్న నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపారు. మండల గూడెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పాడైన బోరుకు రీబోరింగ్ చేయించి మరమ్మతు చేయించారు. దీంతో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు క్రాంతికుమార్‌కు ధన్యవాదాలు తెలిపారు. కాంగ్రెస్ గ్రామశాఖ అధ్యక్షుడు రాజశేఖర్, ఉమసత్యనారాయణ, లక్ష్మణ్, భూషణం, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

శిథిలావస్థలో పశువైద్యశాల

- ఆందోళనలో వైద్య సిబ్బంది
- మందుబాబులకు అడ్డాగా మారిన వైనం
- పట్టించుకోని పాలకులు



శిథిలావస్థలో ఉన్న స్టేషన్‌ఘన్‌పూర్ పశువుల ఆస్పత్రి భవనం



అధ్వానంగా ఉన్న వైద్యశాలలోని గది

స్టేషన్‌ఘన్‌పూర్: డివిజన్ కేంద్రమైన స్టేషన్‌ఘన్‌పూర్‌లో దాదాపు 59 ఏళ్ల క్రితం నిర్మించిన పశు వైద్యశాల ప్రస్తుతం శిథిలావస్థకు చేరి అధ్వానంగా తయారైంది. పశువైద్యశాల భవనం గోడలు, పైకప్పు దెబ్బతిని ఇప్పుడో, అప్పుడో కూలిపోయేటట్లు మారింది. సదరు శిథిలభవనంలో పశు వైద్యాధికారి, వైద్య సిబ్బంది బిక్కుబిక్కుమంటూ విధులు నిర్వహిస్తున్నారు. శిథిలమైన భవనంలో పనిచేస్తున్న వైద్య సిబ్బంది, పశువుల వైద్యం కోసం వచ్చే రైతులు భవనం ఎప్పుడు కూలుతుందోనని సర్వత్రా ఆందోళన చెందుతున్నారు. వివరాలు ఇలా ఉన్నాయి. గతంలో స్టేషన్‌ఘన్‌పూర్, చిల్పూరు కలిసి ఉమ్మడి స్టేషన్‌ఘన్‌పూర్ మండలంగా ఉన్న సమయంలో పశువులకు మెరుగైన వైద్య సేవలు అందించే లక్ష్యంగా అప్పటి ప్రభుత్వ హయాంలో 1966లో పశువైద్యశాల భవనాన్ని నిర్మించారు. పాత స్టేషన్‌ఘన్‌పూర్ గ్రామ పంచాయతీ, ప్రస్తుత మున్సిపాలిటీ కార్యాలయం పక్కనే భవన నిర్మాణం చేశారు. గతంలో వివిధ గ్రామాల నుంచి ప్రతిరోజూ వందకు పైగా పశువులను రైతులు వైద్యం కోసం పశువైద్యశాలకు తీసుకువచ్చేవారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు అనంతరం జిల్లాలు, మండలాల పునర్విభజనలో భాగంగా స్టేషన్‌ఘన్‌పూర్, చిల్పూరు వేర్వేరు మండలాలుగా ఏర్పడ్డాయి. దాంతో ప్రస్తుతం స్థానిక పశువైద్యశాలలో పశుసంవర్ధక శాఖ ఏడీతో పాటు నలుగురు వైద్య సిబ్బంది విధులు నిర్వహిస్తుండగా రోజుకు దాదాపు 50 పశువులకు వైద్యం అందిస్తున్నారు.

మందుబాబులకు అడ్డాగా పశువైద్యశాల

ఘన్‌పూర్ పశువైద్యశాల మందుబాబులకు అడ్డాగా తయారైంది. పశువైద్యశాల భవనం పక్కనే స్టేషన్ ఘన్‌పూర్ మున్సిపాలిటీ కార్యాలయం ఉండగా మున్సిపాలిటీకి సంబంధించిన చెత్త ట్రాక్టర్లు, వాటర్ ట్యాంకర్ ట్రాక్టర్ తదితర వాహనాలను పశువైద్యశాల ఆవరణలో ఉంచుతారు. దాంతో పశువైద్యశాలకు సంబంధించిన మేయిన్‌గేట్ ఎప్పుడూ తెరిచే ఉంటుంది. పశువైద్యశాల ఎదురుగా వరుసగా మూడు వైన్‌షాపులు ఉండటంతో మందుబాబులకు పశువైద్యశాల ఆవరణ సాయంత్రం, రాత్రి సమయాల్లో అడ్డాగా మారుతుంది. మందుబాబులు ఖాళీ సీసాలను పగులగొడుతుండగా గాజు పెంకులతో పశువైద్యశాలకు వచ్చే రైతులకు, పశువులకు తీవ్ర ఇబ్బందిగా మారింది.

వర్షం పడితే అంతే సంగతులు

పశువైద్యశాల పైకప్పు ఉన్న పెంకులు ఊడిపోగా వర్షం పడిదంటే కురుస్తోంది. దాంతో ఆస్పత్రిలో నిల్వ ఉంచే పశువులకు సంబంధించిన మందులు, ఫర్నీచర్, ఇతర వస్తువులు తడిసి దెబ్బతింటున్నాయి. ప్రస్తుత వర్షాకాలంలో భారీ వర్షాలు కురిస్తే భవనం ఎప్పుడు కూలుతుందో, ఏ ప్రమాదం జరుగుతుందోనని వైద్యసిబ్బంది, రైతులు ఆందోళన చెందుతున్నారు. ఈ విషయమై ప్రజాప్రతినిధులు, అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని పలువురు విమర్శలు చేస్తున్నారు. భవనం కూలి ఏదైనా ప్రమాదం జరిగాక చింతించేకన్నా సంబంధిత ఉన్నతాధికారులు, స్థానిక ఎమ్మెల్యే తక్షణమే స్పందించాలని, పశువైద్యశాలకు నూతన భవనాన్ని మంజూరు చేయాలని ప్రజలు, రైతులు కోరుతున్నారు.

పశువైద్యశాలపై నిర్లక్ష్యం తగదు



మూగజీవాలకు వైద్యం అందించే పశువైద్యశాలపై అధికారులు, పాలకులు నిర్లక్ష్యంగా వ్యవహరించడం తగదు. ప్రస్తుతం పశువైద్యశాల ఉన్న శిథిల భవనాన్ని కూల్చివేసి అదేస్థానంలో నూతన భవనాన్ని నిర్మించాలి. ప్రస్తుతం తాత్కాలికంగా ఏదైనా భవనంలోకి పశువైద్యశాలను తరలించాలి. - సాదం రమేష్, జిల్లా కార్యదర్శి, జీఎంపీఎస్

ఉన్నతాధికారులు తక్షణమే స్పందించాలి



స్టేషన్‌ఘన్‌పూర్ పశువైద్యశాల విషయమై సంబంధిత ఉన్నతాధికారులు తక్షణమే స్పందించాలి. పశువుల ఆసుపత్రి ఆవరణలో ఇష్టారాజ్యంగా మున్సిపాలిటీకి చెందిన, ప్రైవేటు వ్యక్తులకు చెందిన వాహనాలను పార్కింగ్ చేస్తున్నారు. దాంతో ఆసుపత్రికి వచ్చే రైతులకు, పశువులకు ఇబ్బందిగా మారుతుంది. - మేకల మల్లేశం, మండల అధ్యక్షుడు, జీఎంపీఎస్

మహానేతకు ఘన నివాళి



పాలకుర్తి టౌన్: వైఎస్సార్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న టీపీసీసీ ఉపాధ్యక్షురాలు ఝాన్సీరెడ్డి తదితరులు



జనగామ: వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేస్తున్న బొడ్డు ప్రవీణ్

సాక్షి నెట్‌వర్క్: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ దివంగత ముఖ్యమంత్రి, మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖర రెడ్డి జయంతిని జిల్లా వ్యాప్తంగా కాంగ్రెస్, వైఎస్సార్ అభిమానులు మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రిగా పలు అభివృద్ధి సంక్షేమ పథకాలతో పేదలు, రైతుల హృదయాల్లో చెరగని ముద్ర వేశారని పలువురు ఆయన సేవలను కొనియాడారు. నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. పలుచోట్ల వైఎస్సార్ జయంతి సందర్భంగా విద్యార్థులకు నోట్‌బుక్స్, ప్లేట్లు, వాటర్ బాటిళ్లను పంపిణీ చేశారు.



కొడకండ్లలో..



చిల్పూరు: మల్కాపూర్‌లో..



స్టేషన్‌ఘన్‌పూర్: వైఎస్సార్ జయంతిలో అభ్యుదయ యువజన సంఘం బాధ్యులు



రఘునాథపల్లి: కంచనపల్లిలో..

కంట్రోల్ ప్యానల్స్ అమర్చుకోవాలి

- ఎన్పీడీసీఎల్ ఎస్ఈ వేణుమాధవ్

జనగామ: జిల్లాలో జూన్ మాసానికి సంబంధించి హెచ్‌టీ వినియోగదారులు యూనిట్ పవర్ ఫ్యాక్టర్ మెయింటెనెన్స్ చేసుకోవాలని ఎన్పీడీసీఎల్ ఎస్ఈ టి.వేణుమాధవ్ అన్నారు. మంగళవారం సర్కిల్ కార్యాలయం నుంచి 98 మంది హెచ్‌టీ వినియోగదారులతో గూగుల మీట్ ద్వారా మాట్లాడారు. పవర్ ఫ్యాక్టర్ మెయింటెనెన్స్‌కు సంబంధించి మూడు నెలల నోటీసులను జారీ చేశామన్నారు. యూనిటీ పవర్ ఫ్యాక్టర్ కోసం ఆటోమేటిక్ పవర్ ఫ్యాక్టర్ కంట్రోల్ ప్యానల్స్‌ను ఖచ్చితంగా అమర్చుకోవాలన్నారు. గూగుల్ మీట్‌లో జిల్లాలోని ఆయా ప్రాంతాలకు చెందిన ఏడుగురు వినియోగదారులు తమ సమస్యలను ఎస్ఈ దృష్టికి తీసుకువచ్చారు. ఈ గూగుల్ మీట్‌లో జనగామ, స్టేషన్‌ఘన్‌పూర్ డీఈలు గణేష్, రాంబాబు, ఎస్ఏఓ జయరాజు, ఏడీలు ఉన్నారు.



గూగుల్ మీట్‌లో మాట్లాడుతున్న ఎస్ఈ వేణుమాధవ్

శానిటేషన్ నిర్వహణపై విమర్శలు సరికాదు



మాట్లాడుతున్న నాయకులు

జనగామ: జనగామ పురపాలికలో పదేళ్ల పాటు అధికారంలో ఉండి, శానిటేషన్ నిర్వహణలో విఫలమయ్యారని బీఆర్‌ఎస్ నాయకులు నిరసన తెలుపడం సరికాదని కాంగ్రెస్ నాయకులు మహ్మద్ ముజ్జు, మిద్దెపాక స్టాలిన్, మహమ్మద్ ఇస్మాయిల్, ఉడుగుల నరింగరావు, మేకల సమ్మయ్య, కలిమొద్దీన్, అయూబ్, లింగాల అనిల్ కుమార్ అన్నారు. డీసీసీ కార్యాలయంలో మంగళవారం వారు మాట్లాడుతూ పురపాలిక పాలకవర్గం కాలపరిమితి ముగిసి ఏడాది గడవక ముందే పారిశుద్ధ్యం అంతా ఈ ప్రభుత్వంలోనే విఫలమైనట్టు మాట్లాడడం విడ్డూరంగా ఉందన్నారు. మున్సిపల్ చైర్‌పర్సన్‌గా బీఆర్‌ఎస్ నాయకులు పని చేసిన సమయంలో పారిశుద్ధ్య నిర్వహణను ఎందుకు పట్టించుకోలేదని ప్రశ్నించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజలు అవసరమైన సేవలు, సంక్షేమం, శానిటేషన్ నిర్వహణ అద్భుతంగా చేస్తున్నామన్నారు. ఈ సారి ఎన్నికల్లో పురపాలికపై కాంగ్రెస్ జెండా ఎగుర వేస్తామన్నారు.

లయన్స్‌క్లబ్ సేవలను సద్వినియోగం చేసుకోవాలి

కొడకండ్ల: నిరుపేదల సంక్షేమమే ధ్యేయంగా లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సేవలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు గాజుల రాములు, కార్యదర్శి పసునూరి మధుసూదన్ కోశాధికారి నేతి కొండయ్యలు కోరారు. మంగళవారం మండలకేంద్రంలోని మార్కండేయ ఫంక్షన్ హాల్‌లో మల్లారెడ్డి నారాయణ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి సహకారంతో నిర్వహించిన ఉచిత వైద్య శిబిర ప్రారంభోత్సవ కార్యక్రమంలో వారు మాట్లాడారు. గ్రామీణ ప్రాంత ప్రజల ఆరోగ్యం కోసం పది మంది వైద్యుల బృందంచే ఈ కార్యక్రమాన్ని నిర్వహించామని, 400 మంది వివిధ గ్రామాల ప్రజలు వచ్చి వైద్య పరీక్షలు, బీపీ, షుగర్, ఈసీజీ పరీక్షలు నిర్వహించి మందులు కూడా ఉచితంగా పంపిణీ చేసినట్లు చెప్పారు. లయన్స్‌క్లబ్ రీజియన్ చైర్మన్ దామెర సరేష్, జోన్ చైర్మన్ నవీన్, మాల్లారెడ్డి నారాయణ ఆసుపత్రి వైద్య బృందం పాల్గొన్నారు.

పప్పు దినుసుల సాగుతో అధిక లాభాలు

- డీఏఓ రామారావునాయక్

స్టేషన్‌ఘన్‌పూర్: పప్పు దినుసుల సాగుతో రైతులు తక్కువ పెట్టుబడితో అధిక లాభాలు పొందవచ్చని జిల్లా వ్యవసాయ అధికారి రామారావునాయక్ అన్నారు. జాతీయ ఆహార భద్రత మిషన్‌లో పథకంలో భాగంగా స్టేషన్‌ఘన్‌పూర్ డివిజన్ పరిధిలోని స్టేషన్‌ఘన్‌పూర్, జఫర్‌గఢ్, చిల్పూరు, రఘునాథపల్లి, లింగాలఘనపురం మండలాల పరిధిలోని రైతులకు కంది, మినుము విత్తనాల మినీ కిట్స్ పంపిణీ కార్యక్రమాన్ని వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం ఘన్‌పూర్‌లో చేపట్టారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన ఏడీఏ మాట్లాడారు. కార్యక్రమంలో ఏడీఏ వసంతసుగుణ, వివిధ మండలాల ఏఓలు, ఏఈఓలు పాల్గొన్నారు.

ఇళ్లు నిర్మించుకునే సభ్యులకు సహకరించండి



రఘునాథపల్లి: మాట్లాడుతున్న డీఆర్డీఓ వసంత



దేవరుప్పుల: కేక్ కట్ చేస్తున్న ఐకేపీ సిబ్బంది

- డీఆర్డీఓ వసంత

రఘునాథపల్లి/బచ్చన్నపేట/దేవరుప్పుల/పాలకుర్తిటౌన్/తరిగొప్పుల/కొడకండ్ల/చిల్పూరు/స్టేషన్‌ఘన్‌పూర్/లింగాలఘణపురం: ఇందిరమ్మ ఇళ్లు నిర్మించుకునే సభ్యులకు అవసరం మేరకు సంఘాల నుంచి రుణాలు అందించాలని డీఆర్డీఓ వసంత సూచించారు. మంగళవారం మండల కేంద్రంలో నవభారతి మండల సమాఖ్య ఆధ్వర్యంలో జరిగిన మహిళా శక్తి సంబరాల్లో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా సమాఖ్య మండల అధ్యక్షురాలు వసంత అధ్యక్షతన జరిగిన సమావేశంలో డీఆర్డీఓ మాట్లాడారు. ఇందిరమ్మ ఇళ్లు నిర్మించుకునే సభ్యులకు నిర్మాణాలు పూర్తయ్యేవరకు తోడ్పాటు నందించాలన్నారు. ఈ సందర్భంగా ఖిలాషాపూర్ ప్రాథమిక పాఠశాల అభివృద్ధి కోసం మండల సమాఖ్య నుంచి రూ.10 వేలు, మహేశ్వరీ గ్రామైఖ్య సంఘం రూ.5 వేలు, ఓరుగల్లు సమాఖ్య రూ.10 వేలు హెచ్‌ఎం యాదవరెడ్డికి అందజేశారు. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మారుజోడు రాంబాబు, మార్కెట్ కమిటీ చైర్మన్ శివరాజ్‌యదవ్, డీసీఓ రాజేందర్‌రెడ్డి, సీడీపీఓ ఫ్లోరెన్స్ పాల్గొన్నారు. అలాగే పలు మండలాల్లో నిర్వహించిన మహిళా శక్తి సంబరాల్లో పలువురు అధికారులు పాల్గొని కేక్‌లు కట్‌చేసి మాట్లాడారు. మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలన్నారు. కార్యక్రమాల్లో డీఏఓ రామారావు నాయక్, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ మాధవీలత, డీపీఓ స్వరూపరాణి, డీఆర్‌డీఏ ఏపీడీ నూరోద్దీన్, అధికారులు, డీపీఎంలు, ఏపీఎంలు, పలు మండ సమాఖ్యల అధ్యక్షురాళ్లు, కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఉచిత శిక్షణను వినియోగించుకోవాలి

జనగామ రూరల్: స్వయం ఉపాధి కోసం ఉచిత శిక్షణ కార్యక్రమాలను వినియోగించుకోవాలని జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి రవీందర్ మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. పంచాయతీరాజ్ గ్రామీణ అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో స్వామి రామానంద తీర్థ గ్రామీణ సంస్థ నిరుద్యోగ యువతీ యువకులకు ఉచిత హాస్టల్ భోజన వసతితో పాటు ఉద్యోగం కల్పిస్తున్నందున ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు ఫోన్ నంబర్ల 9133908000, 9133908111, 9133908222, 9948466111లో సంప్రదించాలన్నారు.

విద్యార్థులకు ప్రోత్సాహకాలు

దేవరుప్పుల: ప్రభుత్వ పాఠశాలల పురోగతి కోసం పలు గ్రామాల్లో దాతలు విరివిగా విద్యార్థులకు ప్రోత్సహకాలు అందించారు. మంగళవారం మండలంలోని గొల్లపల్లి ఎంపీయూపీఎస్‌లో స్థానిక కాంగ్రెస్ నాయకుడు కోనేటి నర్సయ్య 30 మందికి షూ పంపిణీ చేశారు. ఇదే పాఠశాల హెచ్‌ఎం రాజు సొంత ఖర్చుతో టైబెల్టులు, ఐడీ కార్డులు అందజేశారు. అలాగే ధర్మాపురం హైస్కూల్ విద్యార్థులకు బీఆర్‌ఎస్ గ్రామ అధ్యక్షుడు కన్నెబోయిన దేవరాజు, దేవరుప్పుల ప్రాథమిక పాఠశాలకు వ్యాయామ ఉపాధ్యాయులు మధు ఆధ్వర్యంలో నోటు పుస్తకాలు అందజేశారు.

నియోజకవర్గ ప్రజల రుణం తీర్చుకోలేనిది

- ఎమ్మెల్యే కడియం శ్రీహరి



స్టేషన్‌ఘన్‌పూర్: కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే కడియం శ్రీహరి, ఎంపీ కావ్య

స్టేషన్‌ఘన్‌పూర్/జఫర్‌గఢ్/రఘునాథపల్లి: ఎన్ని జన్మలు ఎత్తినా నియోజకవర్గ ప్రజల రుణం తీర్చుకోలేనిదని స్థానిక ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. డివిజన్ కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో, జఫర్‌గఢ్‌లోని సామాజిక ఆరోగ్య కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కడియం శ్రీహరి అభిమానుల ఆధ్వర్యంలో మంగళవారం కడియం జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రీహరి, ఎంపీ కావ్యతో కలిసి కేక్ కట్ చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాలను వారు ప్రారంభించారు. ఎమ్మెల్యే కడియం మాట్లాడుతూ ఎన్టీఆర్ పిలుపు మేరకే రాజకీయాల్లోకి వచ్చానని అన్నారు. జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన ప్రజలకు, కాంగ్రెస్‌పార్టీ నాయకులందరికీ కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమాల్లో కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు. అలాగే రఘునాథపల్లి మండల కేంద్రంలోని బస్టాండ్ వద్ద మండల అధ్యక్షుడు కోళ్ల రవిగౌడ్ ఆధ్వర్యంలో కడియం పుట్టినరోజు వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి స్వీట్లు, పండ్లు పంపిణీ చేశారు.

గుంతల పూడ్చివేత



జనగామ: పట్టణంలోని ధర్మకంచ ఏరియా పరిధిలో భగత్‌సింగ్ యూత్ ఆధ్వర్యంలో ప్రమాదాల నివారణకు స్వచ్ఛందంగా రోడ్డుపై ఉన్న గుంతలను పూడ్చి వేశారు. మున్సిపల్ అధికారుల దృష్టికి తీసుకు వెళ్లినా పట్టించుకోక పోవడంతో యూత్ సభ్యులు దుబ్బాక వీరస్వామి, సహచరులతో కలిసి సిమెంటుతో ప్రమాదాల నివారణకు స్పీడ్ బ్రేకర్‌తో చర్యలు తీసుకున్నారు.

విద్యార్థులపై తల్లిదండ్రులు శ్రద్ధ వహించాలి



లింగాలఘణపురం: విద్యార్థులపై తల్లిదండ్రులు శ్రద్ధ వహించాలని, కేవలం ఉపాధ్యాయులపైనే భారం వేయకుండా రోజువారిగా పాఠశాల నుంచి వచ్చిన అనంతరం ఏం చేస్తున్నారనే విషయాలపై దృష్టి పెట్టాలని డీఈఓ భోజన్న సూచించారు. మంగళవారం మండల కేంద్రంలోని మోడల్ స్కూల్‌లో పేరెంట్స్, టీచర్స్ మీటింగ్ ప్రిన్సిపాల్ సునిత అధ్యక్షతన జరిగింది. ముఖ్యఅతిథిగా డీఈఓ హాజరై తల్లిదండ్రులకు పలు సూచనలు చేశారు. డీఈఓతో పాటు ఎంఈఓ విష్ణుమూర్తి ఉన్నారు.

పరామర్శ

జనగామ/రఘునాథపల్లి: ఎర్రవెల్లి ఫాంహౌజ్‌లో ఇటీవల గాయపడ్డ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డిని మంగళవారం హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో జిల్లా కోర్టు న్యాయవాదులు పరామర్శించారు. ఎమ్మెల్యే త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. న్యాయవాదులు ఎలగందుల భిక్షపతి, మన్నె సత్తయ్య, ఎస్.కిషన్‌గౌడ్, జి.అమృతరావు ఉన్నారు. అలాగే రఘునాథపల్లి మండల బీఆర్‌ఎస్ నాయకులు పల్లాను పరామర్శించారు. జిట్టె వీరస్వామి, బాల్నె రాజయ్య, బండమీది వెంకన్న, శాగ రాజు, నక్క సుదర్శనం ఉన్నారు.

పేదల సంక్షేమమే ధ్యేయం

బచ్చన్నపేట: రాష్ట్ర ప్రభుత్వం పేదల సంక్షేమమే ధ్యేయంగా పని చేస్తున్నదని సిద్ధేశ్వరాలయ మాజీ చైర్మన్ గాలి కృష్ణ అన్నారు. మంగళవారం కేసిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన వద్దుల కనుకయ్యకు మంజూరైన రూ. 17,500, కట్కూర్‌కు చెందిన చవాన్ శారదకు మంజూరైన 22వేల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి ప్రజా సంక్షేమార్థం అనేక పథకాలను అమలు చేస్తున్నారని అన్నారు. నిడిగొండ శ్రీనివాస్, పుట్ట నర్సింహులు, బాల్నె రమేష్, దర్శన్‌రెడ్డి, శంకరయ్య, మల్లయ్య, శ్రీనివాస్, గాలి తిరుపతి పాల్గొన్నారు.

ద్విచక్రవాహన దొంగ అరెస్ట్

రఘునాథపల్లి: ద్విచక్రవాహనం, గ్యాస్ సిలిండర్ అపహరించిన దొంగను రఘునాథపల్లి పోలీసులు అరెస్ట్ చేసి మంగళవారం రిమాండ్‌కు తరలించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సిద్దిపేట జిల్లా చేర్యాల మండలం, ఆకునూరు గ్రామానికి చెందిన ఎస్‌కె ఖయ్యుం ఈ నెల 6వ తేదీన మోత్కూరు గ్రామంలో ఎలుక మల్లయ్యకు చెందిన టీవీఎస్ ఎక్సెల్‌ను దొంగిలించాడు. అదే ద్విచక్ర వాహనంపై ఈ నెల 7న మండలంలోని కంచనపల్లికి చేరుకుని ఆమనగంటి రాజశేఖర్ గ్యాస్ సిలిండర్‌ను దొంగలించాడు. నమ్మదగిన సమాచారం మేరకు మంగళవారం ఖయ్యుంను అరెస్ట్ చేసి అతని వద్ద ఉన్న ద్విచక్రవాహనం, గ్యాస్ సిలిండర్‌ను స్వాధీనం చేసుకొని రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై దూదిమెట్ల నరేష్ తెలిపారు.

ఘనంగా సీత్లా పండుగ

కొడకండ్ల: సీత్లా పండుగ వేడుకలను మంగళవారం మండలంలోని గిరిజనులు ఘనంగా జరుపుకున్నారు. మండలంలోని గిరిజన తండాల్లో తమ ఆచార సాంప్రదాయాలకనుగుణంగా గిరిజనులు వేడుకలను నిర్వహించుకుని సీత్లా భవానికి పూజలు చేసి పాడిపంటలు సమృద్ధిగా పండి, ఆయురాగ్యాలతో ఉండాలని అమ్మవారిని కోరుకొన్నారు.

సంక్షిప్త సమాచారం

దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలి



జఫర్‌గఢ్/పాలకుర్తి/రఘునాథపల్లి: నేడు(బుధవారం) నిర్వహించనున్న దేశ వ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని కోరుతూ సీపీఎం, రైతు సంఘం ఆధ్వర్యంలో జఫర్‌గఢ్ మండల కేంద్రంలో నాయకులు, కార్యకర్తలు మంగళవారం బైక్ ర్యాలీని నిర్వహించారు. ఈ సందర్భంగా రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు రాపర్తి సోమయ్య, పార్టీ మండల కార్యదర్శి గుండెబోయిన రాజు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం పూర్తిగా కార్మిక వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్నదన్నారు. తక్షణమే కార్మిక చట్టాలను రద్దు చేయడంతో పాటు 8 గంటల పని విధానాన్ని అమలు చేయాలన్నారు. కాట సుధాకర్, వడ్లకొండ సుధాకర్, నల్లతీగల శ్రీనివాస్, ఎస్‌కే ఎక్బాల్ సాకి నర్సింగం పాల్గొన్నారు. అలాగే పాలకుర్తిలోని చిట్యాల ఐలమ్మ స్మారక భవనంలో ఏర్పాటు చేసిన సమావేశంలో సీపీఎం నాయకులు మాట్లాడుతూ సమ్మెను విజయవంతం చేయాలని కోరారు. చిట్యాల సోమన్న, మాచర్ల సారయ్య తదితరులు పాల్గొన్నారు. కాగా, దేవరుప్పులలో సీఐటీయూ జిల్లా నాయకులు సమ్మెను సయప్రదం చేయాలని కరపత్రాలను పంపిణీ చేశారు.

చర్య తీసుకోవాలి

తరిగొప్పుల: వాచ్యవెంకట్‌తండా గ్రామపంచాయతీ కార్యదర్శి భూక్య లింగం కర్రతో దాడికి పాల్పడిన లావుడ్య రమేష్‌పై చర్యలు తీసుకోవాలని కోరుతూ పంచాయతీ కార్యదర్శుల సంఘం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం లోకల్ బాడీస్ అదనపు కలెక్టర్ పింకేష్ కుమార్‌కు వినతిపత్రం అంజేశారు. ఈ సందర్భంగా స్పందించిన ఆయన వెంటనే డీసీపీకి ఫోన్‌చేసి సంబంధిత వ్యక్తిపై కేసు నమోదు చేయాలని ఆదేశించారు. పంచాయతీ కార్యదర్శులపై ఎలాంటి దాడులు జరిగిన ఫిర్యాదు చేసిన తక్షణమై కేసు నమోదు కఠిన చర్యలు తీసుకోవాలని పోలీసు అధికారులను ఆదేశించారు. కనకం విజయ్‌కుమార్, బొట్ల శంకర్, గుడా రమ్య, ఆమనగంటి మహేందర్, దామెర వంశీ, భూక్య రాజేందర్, గడ్డం శ్రీకాంత్ పాల్గొన్నారు.

'గుడిలోకి రాకుండా అడ్డుకోవడం సరికాదు'

జనగామ రూరల్: తొలి ఏకాదశి రోజున దళితుడైన వర్కల శ్రీకాంత్‌ను సీతారామ ఆంజనేయస్వామి దేవాలయంలోకి రాకుండా అడ్డుకోవడం, గుడికి తాళం వేసి అవమానించడం సరికాదని కరెన్సీపై అంబేడ్కర్ ఫొటో సాధన సమితి జాతీయ అధ్యక్షుడు జేరిపోతుల పరశురామ్ అన్నారు. ఈ మేరకు దళితలు గుడిలోకి రాకుండా అడ్డుకున్న పూజారిని కఠినంగా శిక్షించాలని దళిత సంఘాల ఆధ్వర్వ్యంలో మంగళవారం పట్టణంలోని ఆంజనేయస్వామి గుడిచుట్టు తడిబట్టలతో నిరసన ప్రదర్శన చేపట్టారు. మల్లిగారి రాజు, బొట్ల శేఖర్, తిప్పారపు విజయ్, ముక్క స్వామి తదితరులు పాల్గొన్నారు.

పోస్టర్ ఆవిష్కరణ

లింగాలఘణపురం: మండల కేంద్రంలో ఈ నెల 12,13 తేదీల్లో జరిగే సీపీఎం శిక్షణ తరగతుల పోస్టర్‌ను మంగళవారం మండల కేంద్రంలో ఆ పార్టీ మండల కార్యదర్శి కరుణాకర్ ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. శిక్షణ తరగతులను విజయవంతం చేయాలని ఆయన కోరారు. ఆయనతో పాటు నాయకులు శంకరయ్య, దేవదానం, ఉప్పలయ్య, సుల్తానా, సమ్మయ్య, భిక్షపతి పాల్గొన్నారు.

మహిళా డిగ్రీ కళాశాలలో స్పాట్ అడ్మిషన్‌కు కౌన్సెలింగ్

జనగామ రూరల్: గిరిజన సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాలలో డిగ్రీ ప్రథమ సంవత్సరంలో స్పాట్ అడ్మిషన్‌కు కౌన్సెలింగ్‌కు విద్యార్థులు హాజరు కావాలని ప్రిన్సిపాల్ సంధ్యారాణి మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. ఇంటర్మీడియట్ పాసైన ఎస్టీ గిరిజన బాలికలకు 11,12 తేదీల్లో స్పాట్ అడ్మిషన్ ఉంటుందని తెలిపారు. సంబంధిత సర్టిఫికెట్లతో ఉదయం 10 గంటలకు హాజరుకావాలన్నారు. బీఏ, బీకాం జనరల్, బీకాం సీఏ, ఎంబీ జెడ్‌సీ, ఎంపీసీఎస్, డేటా సైన్స్, బీజెడ్‌సీ, ఫుడ్ అండ్ న్యూట్రీషన్ తదితర కోర్సులు అందుబాటులో ఉన్నాయన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. 90 శాతం ఎస్టీ విద్యార్థులకు, 10 శాతం ఇతర వర్గాల విద్యార్థులకు సీట్లు కేటాయించనున్నట్లు పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు 9553860492 నంబర్‌లో సంప్రదించాలన్నారు.